క్లుప్తంగా

కేసు నమోదు

సంతకవిటి: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కేర్ ఆస్పత్రి జంక్షన్ వద్ద ఉన్న తన కార్యాలయంలోకి కొంతమంది వ్యక్తులు ఆదివారం వచ్చి, తనను భయభ్రాంతులకు గురిచేసినట్లు రాజాం శాసనసభ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి ఎన్ని రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు.

విశాఖ బస్సును పునరుద్ధరించాలి

వంగర: మండలంలోని బంగారువలస నుంచి విశాఖపట్నానికి నడిపే ఆర్‌టీసీ బస్సును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత మూడు నెలలుగా పాలకొండ డిపోకు చెందిన ఈ బస్సు సర్వీసును నిలిపివేశారని, దీంతో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లి, వచ్చేందుకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి, ఎప్పటిలాగే బస్సును కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఆదివారం ఒక్కరోజే 40 మంది ఇన్ పేషెంట్లుగా చేరి, చికిత్స పొందుతున్నారు. రోగుల్లో ఎక్కువ మంది కడుపునొప్పి, విరేచనాలు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఆస్పత్రిలో చేరుతున్న వారికి సరిపడ గదులు లేకపోవడంతో ఆస్పత్రి వరండాలోనే బెడ్లు వేసి, రోగులకు చికిత్స అందిస్తున్నారు. అయితే ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యసేవలు అందుబాటులో ఉండడంతో రోగులు క్రమక్రమంగా కోలుకుంటున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పలనాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం కలిసి పరామర్శించారు. అప్పలనాయుడు భార్య సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామం వెళ్లి, ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, మాజీ ఎంపీటీసీ శాసపు తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జల్ జీవన్ మిషన్ పనులు

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీకి అనుబంధంగా ఉన్న బొడ్డవలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జరుగుతున్న మంచినీటి కుళాయిల ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్, ఎంపీటీసీ మజ్జి సంధ్యాశ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభిలు కలిసి ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని మొత్తం 155 ఇళ్లకు పూర్తి స్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

రైల్వే టికెట్ బుకింగ్ కార్యాలయం ఏర్పాటు



రైల్వేస్టేషన్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బుకింగ్ కార్యాలయం

బొబ్బిలి: స్థానిక రైల్వేస్టేషన్‌లో తాత్కాలిక రైల్వే టికెట్ బుకింగ్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు సిబ్బంది తెలిపారు. మూడో రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా ఇప్పుడున్న రైల్వే బుకింగ్ కార్యాలయం తొలగించాల్సి వస్తుండడంతో పాత కార్యాలయం పక్కనే ఉన్న భవనంలో బుకింగ్ కార్యాలయం ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ కార్యాలయం సేవలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు.

జిందాల్ లేఆఫ్‌ను ఎత్తివేయాలి

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం లేఆఫ్‌ను తక్షణమే ఎత్తేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీ ఉదయం కర్మాగారం ఆకస్మికంగా లేఆఫ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. నాటి నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తూ, వంటా వార్పు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కార్మికులు తమ డిమాండ్లను జిల్లా లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ డిమాండ్లపై యాజమాన్యం తమ వైఖరిని 29వ తేదీన తెలియజేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కార్మిక సంఘం జేఏసీ నాయకులు ఆదివారం మాట్లాడుతూ యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. 29వ తేదీన జరగబోయే రెండో దఫా చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

- గ్రంథాలయాల్లోని వేసవి శిక్షణా తరగతులకు విశేష స్పందన
- సరదా వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్య
- తరగతులకు హాజరయ్యేందుకు ఆసక్తి కనబరుస్తున్న చిన్నారులు



రామభద్రపురం: పిల్లలతో మ్యూజికల్ చైర్ ఆడిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

రామభద్రపురం: ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. చాలా సరదా వాతావరణంలో విద్యా సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆటపాటలను కూడా నేర్పిస్తుండడంతో గ్రంథాలయాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు, అంత్యాక్షరి పోటీలతో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం మంచి నడవడిక, మంచి అలవాట్లను వివరించి, అనుసరించాలని నిర్వాహకులు కోరారు. శిక్షణా తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం దగ్గర నుంచి కథలు చదవడం, చెప్పించడం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి కూడా నేర్పిస్తున్నామని లైబ్రేరియన్ సత్యవాణి తెలిపారు. వేసవి సెలవుల్లో కూడా పిల్లలు చెడు అలవాట్ల బారినపడి, వారి జీవితం నాశనం కాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

బాడంగి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులకు ఆదివారం హాజరైన విద్యార్థులకు ఆటల పోటీలు, కథల పోటీలు నిర్వహించారు. అలాగే ప్రతీ విద్యార్థికి ఒక పుస్తకం ఇచ్చి, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించారు. అనంతరం కంప్యూటర్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు.



తెర్లాం: పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించి, పిల్లలతో పుస్తకాలు చదివించారు. అనంతరం పుస్తక పఠనంపై అవగాహన కల్పించి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. విద్యార్థులు ప్రాథమిక పాఠశాల దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ తెలిపారు. ఆ తర్వాత చిత్రలేఖనంపై విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సన్మానం పొందిన విద్యార్థులతో మానవతా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మానవతా సంస్థ రాజాం శాఖ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్ కోరారు. మండలంలో రేగిడి, వంగర మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని, సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రేగిడి మండలం నుంచి ఏవీపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కడగల దీపిక (581), లక్ష్మీపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నెల్లి శేషాద్రినాయుడు(580), కెంబూరు ప్రవీణ్ (577)లు, వంగర మండలం నుంచి వంగర జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పాలవలస యామిని(585), కేజీబీవీకి చెందిన బి.చాందిని(577), వంగర జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన రాగోలు శివ(576)లు సత్కారం పొందిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు విష్ణుమూర్తి, ఎస్.సత్యనారాయణ, నీలకంఠయాదవ్, అప్పలనాయుడు, పి.చైతన్య, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

బొబ్బిలి: మండలంలోని పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల కలయిక పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపిగుర్తులను జ్ఞాపకం చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, కె.రామకృష్ణనాయుడు, ఎస్.శశిభూషణనాయుడు, నీలవేణి, పురుషోత్తం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం చేయాలి



భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: ప్రతిఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని పాలకొండకు చెందిన సత్యసాయి భజన మండలి సభ్యుడు, ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ తెలిపారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న గీతాశ్రమంలో ఆదివారం నిర్వహించిన దివ్యజీవన సత్సంగ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. భగవద్గీత పారాయణం చేసిన మానవుడు ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉంటుందని, భగవద్గీత చదివితే మంచి చెడులు తెలియడంతో పాటు మానవసేవే మాధవసేవ అనే భావన కలుగుతుందన్నారు. అనంతరం అన్నదానం, నారాయణసేవ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు గొర్లె దామోదరరావు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

రేగిడి: మంచి సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఆధ్యాత్మిక వక్త సాయిమురళీకృష్ణ మాస్టారు తెలిపారు. ఆదివారం స్థానిక విశ్వసాయి మందిరం వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక ప్రసంగం ఇచ్చిన ఆయన.. అందరూ సేవాగుణం అలవర్చుకోవాలని, తమకు తోచిన సాయం ఇతరులకు చేయాలని సూచించారు. అలాగే ధర్మ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి భజనమండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

300 మందికి దంత వైద్యసేవలు



దంతాలు పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో ఆదివారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన 300 మందికి దంత వైద్యసేవలు అందజేశారు. వివిధ దంత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయికృష్ణ, శ్రీనివాసరావు, ప్రహర్ష, గ్రామ సేవా సమితి సభ్యుడు గొంగాడ శంకరరావు పాల్గొన్నారు.

జీవామృతంతో ఆరోగ్యవంతమైన పంట



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి: పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తయారైన జీవామృతం ఎరువును వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ పి.రమాదేవి తెలిపారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో స్వయం శక్తి సంఘాల మహిళలకు జీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. పంటకు రసాయన ఎరువుల బదులుగా ఆవుపేడ, ఆవుమూత్రంతో తయారు చేసే జీవామృతాన్ని వినియోగిస్తే పంటకు చీడపీడలు పట్టవన్నారు. అలాగే పంట దిగుబడి కూడా బాగా వస్తుందన్నారు.

నేటి నుంచి పైడితల్లి పండగ



పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో పైడితల్లి పండగ సోమవారం నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం ఘటాల తిరువీధి, అంజలి రథోత్సవం, బుధవారం గ్రామ శివారులోని అమ్మవారి ఆలయం వద్దకు భక్తులు చేరుకుని, ప్రత్యేక పూజలు చేసుకుని, మొక్కులు చెల్లించుకుంటారని గ్రామపెద్దలు చెబుతున్నారు. పదేళ్ల తర్వాత గ్రామదేవత పండగ జరుగుతుండడంతో ఉపాధి, ఉద్యోగాలు రీత్యా వివిధ ప్రదేశాల్లో స్థిరపడిన వారంతా ఒక్కసారిగా గ్రామానికి రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడ పండగ ఫ్లెక్సీలు, బ్యానర్లు, విద్యుత్ అలంకరణలతో గ్రామం మెరిసిపోతోంది. సోమ, మంగళవారాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

యువ కవులకు స్ఫూర్తిప్రదాత ఆచార్య భావన్

విజయనగరం టౌన్: ఎందరో యువ కవులను తయారు చేసిన స్ఫూర్తిప్రదాత డాక్టర్ ఆచార్య భావన్ అని హైదరాబాద్‌కి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కానూరి బాపూజీ అన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య భావన్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జాషువా కవిత్వంపై పరిశోధనలు చేసిన భావన్.. జాషువా కవితల్లోని తత్వాన్ని తెలుగు ప్రజలకు వివరించారన్నారు. అనంతరం ప్రధాన వక్తను సమాఖ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ముందుగా భావన్ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, సమాఖ్య ప్రతినిధులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభాధ్యక్షుడిగా ధర్మపురి డిగ్రీకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎల్ఎన్.మూర్తి, సమ్మానకర్తగా సమాఖ్య ఉపాధ్యక్షుడు భోగరాజు ఖాదరవలీ బాబూజీ వ్యవహరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, భావన్ మనవడు పీఎస్‌పీ శేషాచార్యులు, దామరాజు శంకరం, భైరవభట్ల శివరామ్, డాక్టర్ విజయాదిత్య, శిరీషా రఘురామ్, ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ అయ్యగారి రాఘవరావు, సోమేశ్వరరావు, డాక్టర్ హరిచందన్, భాస్కరరావు, నీలాద్రి, ప్రసాద్, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



పాతరేగలో గ్రామపెద్దలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

రామభద్రపురం: బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని పాతరేగ గ్రామంలో గ్రామస్తులతో ఆదివారం సమావేశమైన ఆయన.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎక్కడైనా ఎవరైనా బెట్టింగ్ వేసినట్లు తెలిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ఎన్నికల దృష్ట్యా గుర్తించిన మండలంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో పర్యటిస్తున్నామని, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు రానున్నాయని, ఆరోజు ఏ గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల అనంతరం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత గ్రామపెద్దలపై కూడా ఉందన్నారు. గ్రామాల్లో తగాదాలు సృష్టించిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

జూన్ 7 నుంచి బ్రహ్మోత్సవాలు

గజపతినగరం: స్థానిక బజారు సెంటర్‌లోని సీతారాముల ఆలయంలో స్వామి వారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమస్యలను ఎత్తిచూపేవే శ్రీపాద కథలు

- ప్రముఖ సాహితీవేత్త శాంతారావు



మాట్లాడుతున్న సాహితీవేత్త శాంతారావు

రాజాం సిటీ: సమాజంలోని సమస్యలను ఎత్తిచూపుతూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు రాశారని ప్రముఖ సాహితీవేత్త రాజాపు శాంతారావు తెలిపారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక 112వ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. 'శ్రీపాద కథల్లో సామాజిక జీవనం' అనే అంశంపై ప్రసంగించారు. ఆధునిక కవులలో శ్రీశ్రీ, గురజాడలకు వచ్చినంత ఖ్యాతి కథకుడిగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి రావాల్సిందని, కానీ ఆయన మరుగునపడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కాలం నాటి తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోను శ్రీపాద రచనలు చేశారన్నారు. ఇలాంటి తవ్వాయి వస్తే, ఇద్దరం ఒకచోటికే పోదాం వంటి దాదాపు 80 కథలు రాసిన శ్రీపాద తన కాలంనాటి అగ్రహారంలోని బ్రాహ్మణ స్త్రీలు, బ్రాహ్మణేతరుల సమస్యలను లేవనెత్తుతూ కథలు రాశారన్నారు. కథలన్నింటినీ సంభాషణ రూపంలోనే పూర్తి చేశారన్నారు. తెలుగు వారంతా ఒక జాతిగా రూపుదిద్దుకోవాలనే ఆకాంక్షను వందేళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేశారన్నారు. వచనానికి ప్రాధాన్యమిచ్చి వ్యవహార భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అనంతరం రారవే సభ్యులు శాంతారావును సత్కరించారు. కార్యక్రమంలో రారవే నిర్వాహకులు గార రంగనాథం, పొదిలాపు శ్రీనివాసరావు, పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, పెంకి దయానిధినాయుడు, ఆల్తి మోహనరావు, పొట్నూరు కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీ విత్తనాలతో తెగుళ్ల నివారణ



దేశవాళీ విత్తనాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సంతకవిటి: దేశవాళీ వరి విత్తనాలు పొలాల్లో వేసుకుంటే పంటకు పట్టే తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, జయమ్మ, రమణ తెలిపారు. మండలంలోని సోమన్నపేట గ్రామంలో ఉన్న రైతులకు దేశవాళీ విత్తనాలు–వాటి ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైసూను మల్లిక, నవారా, కాయలబట్టి, చిట్టిముత్యాలు, బహురూపి, బ్లాక్‌రైస్, చింతలూరి సన్నాలు వంటి దేశవాళీ విత్తనాలు వేసుకుని, సాగు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయని వివరించారు. ఎకరాకు 20 కిలోల విత్తనాలు అవసరమని, వీటికి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తయారు చేసిన ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కషాయాలను ఎరువుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల ధాన్యం వరకు దిగుబడి వస్తుందన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



చాటాయివలసలో పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని చాటాయివలస, వండానపేట, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ మాట్లాడుతూ ఖరీఫ్ ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలను పొలాల్లో వేసుకుని, అవి మొక్కలైన తర్వాత అదే నేలలో కలియదున్నాలన్నారు. దీంతో నేల సారవంతం కావడంతో పాటు పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచే లభ్యమవుతాయన్నారు. చీడపీడలు తగ్గి పంట దిగుబడులు కూడా బాగుంటాయన్నారు.

వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పీడీ సన్నిబాబు

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీ సన్నిబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రతిరోజూ 30 మంది విద్యార్థులకు తగ్గకుండా వివిధ క్రీడల్లో ఇస్తున్న శిక్షణకు హాజరవుతున్నారు. ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్ వంటి క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నామని పీడీ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరై, క్రీడల్లో నైపుణ్యం సాధించుకోవాలని కోరారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హనుమాన్ దీక్షా సమితి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు

బొబ్బిలి: హనుమాన్ జయంతి పురస్కరించుకుని, జూన్ 1వ తేదీన స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి చేపట్టనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఇదే విషయం తెలియజేస్తూ రూపొందించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. హిందూ ఉత్సవ సమితి, హనుమాన్ దీక్షా సేవా సమితిల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పువ్వల శ్రీనివాసరావు, పెంట స్వామినాయుడు, చెలికాని కేశవ, రమేష్ మాస్టారు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు: సీఐ

పూసపాటిరేగ: జూన్ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిప్పలవలస గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఎన్నికల కోడ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు చేసినా, బాణసంచా కాల్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటె ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని సూచించారు.

ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై ఎ.సన్యాసినాయుడు ఉన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గుట్కా విక్రయాలు

- ఒడిశా నుంచి దిగుమతి
- పట్టించుకోని స్థానిక అధికారులు
- పెడదోవ పడుతున్న యువత



పట్టణంలోని ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన గుట్కా ప్యాకెట్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలో నిషేధిత గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పాన్ షాపుల్లోనూ, కిరాణా దుకాణాల్లోనూ గుట్కా, ఖైనీ విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యాపారులు ట్రైన్‌లో ఒడిశా నుంచి వాటిని తీసుకొచ్చి నెల్లిమర్ల పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు ఈ సంగతి తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల పట్టణ కేంద్రంగా నిషేధిత గుట్కా, ఖైనీ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉంటున్న ఒక వ్యాపారితో పాటు గాంధీనగర్ కాలనీకి చెందిన మరో వ్యాపారి గుట్టుచప్పుడు గాకుండా ఈ వ్యాపారం సాగిస్తున్నారు. నిత్యం ఒడిశా నుంచి రైళ్లలో రహస్యంగా తీసుకొస్తున్నారు. ఇళ్ల వద్దనే గుట్టుగా నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పట్టణంలో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అన్ని పాన్ షాపుల్లోనూ, కిరాణా దుకాణాల్లోనూ నిషేధిత గుట్కా, ఖైనీ విచ్చలవిడిగా లభ్యమవుతోంది. దీంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి అక్రమ గుట్కా, ఖైనీ వ్యాపారాన్ని నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.